క్లుప్తంగా

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా మాలమహానాడు నేత దాసీ జయప్రకాష్ కెనడీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కెనడీ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెలంపల్లి శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వెలంపల్లి శ్రీనివాసరావు కెనడీని అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న మోసపూరిత విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. పార్టీ పటిష్టతకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. గతంలో దాసీజయప్రకాష్ కెనడీ పార్టీకి సంబంధించి పలు పదవుల్లో పని చేశారు.

భక్తులకు అన్నసమారాధన

సత్యనారాయణపురం(విజయవాడ సెంట్రల్): స్థానిక అయోధ్యనగర్‌లోని శ్రీ శివకామేశ్వరీ సమేత నిలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో దసరా మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. 11 రోజుల పాటు అమ్మవారికి వివిధ అలంకారాలు, ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహిచారు. దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆలయ నిర్వాహకులు ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుండె సుందర్‌పాల్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కుశలవ హ్యుందయ్ కార్లకు విశేష డిమాండ్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): దసరా పండుగ సందర్భంగా విజయవాడలో హ్యుండయ్ కార్లకు విశేష డిమాండ్ కనబడిందని కుశలవ విజయవాడ హ్యుండయ్ డైరెక్టర్ చుక్కపల్లి సిద్ధార్థ, బి.వెంకటరెడ్డి తెలిపారు. భారీ డిస్కౌంట్లు, ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుతో దసరా పండుగ ఒక్క రోజునే 80 కార్ల వరకు వినియోగదారులకు డెలివరీ చేసి గొప్ప మైలురాయిని సాధించామన్నారు. హ్యుండయ్ ప్రసిద్ధ ఎస్‌యూవీ పోర్ట్ ఫోలియో -క్రిటా గురించి ఎంక్వయిరీతో పాటు బుకింగ్స్ కూడా జరిగాయని చెప్పారు. వినియోగదారుల విశ్వాసం పెరగడం, ఆకర్షణీయమైన పండుగ ఆఫర్లతో తమ సంస్థ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

దుర్గ గుడి పాలకమండలి నుంచి పార్వతిని తొలగించాలి

వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంటిబాబు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): రాష్ట్రంలో అతి పెద్ద రెండో దేవస్థానమైన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం పాలకమండలి బోర్డ్ డైరెక్టర్‌గా నియమితురాలైన తరిగొప్పుల పార్వతిని తక్షణమే తొలగించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాదిలి చంటిబాబు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పార్వతిని బోర్డ్ డైరెక్టర్‌గా నామినేట్ చేసిన కూటమి ప్రభుత్వానికి ఆమె కోడలి హత్య కేసులో జైలుకు వెళ్లి వచ్చిన సంగతి తెలియదా అని ప్రశ్నించారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా జగ్గయ్యపేటకు చెందిన జెడ్పీటీసీ సభ్యురాలి కారును వేరే వ్యక్తి తీసుకువెళ్లగా అందులో తెలంగాణా మద్యం ఉందని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో దుర్గ గుడి పాలకమండలి సభ్యురాలిగా ఆమెను వెంటనే తొలగించారని గుర్తు చేశారు. మరి హత్య కేసులో 90 రోజులు జైలు జీవితం గడిపిన తరువాత బెయిల్‌పై ఉన్న పార్వతిని ప్రతిష్టాత్మకమైన దుర్గమ్మ గుడిలో ఎలా నియమించారని ప్రశ్నించారు. ఆలయ ప్రతిష్టను, భక్తుల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని వెంటనే పార్వతిని తొలగించాలన్నారు.

వన్‌టౌన్ పీఎస్‌లో వైభవంగా చండీ హోమం

- పూర్ణాహుతితో ఉత్సవాలకు ముగింపు పలికిన సీపీ రాజశేఖర్‌బాబు
- పోలీసు అధికారులకు, పేదలకు అన్నదానం



చండీహోమం నిర్వహిస్తున్న సీఐ గురుప్రకాష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దసరా శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపును పురస్కరించుకొని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో శనివారం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. దసరా ఉత్సవాల సందర్భంగా స్టేషన్ ప్రాంగణంలో కలశాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే. ముగింపు సందర్భంగా వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో దసరా ఉత్సవాల్లో చండీ హోమాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు పలువురు ఐపీఎస్ అధికారులు స్వయంగా హాజరై పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడే మహార్నవమి రోజున ఆయుధ పూజలు కూడా వైభవంగా నిర్వహించారు. విజయదశమి రోజున స్వాక్షాత్ దుర్గమ్మ ఇంద్రకీలాద్రి కొండ దిగి పోలీసుస్టేషన్‌కు వచ్చి పూజలందుకొని తిరిగి వెళ్లింది. అటువంటి పలు కార్యక్రమాల అనంతరం అన్నసమారాధన నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వహణాధికారి శీనానాయక్, పోలీసు కమిషనర్ రాజశేఖరబాబులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేలాది మంది పేదలకు స్టేషన్ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. అలాగే పోలీసు కుటుంబాలు సైతం స్టేషన్ ప్రాంగణంలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు. పోలీసు కమిషనర్ సైతం పోలీసు సిబ్బందితో కలిసి ప్రసాదాలను స్వీకరించారు. జాయింట్ సీపీ, డీసీపీలు, ఏసీపీలు, సీఐలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక సీఐ గురుప్రకాష్, ఏసీపీ ఎన్.దుర్గారావు పర్యవేక్షించారు.



వన్‌టౌన్ పీఎస్‌లో పూజలు నిర్వహిస్తున్న సీపీ రాజశేఖర్‌బాబు



అన్నదానం ప్రారంభిస్తున్న ఈవో శీనానాయక్

ఉత్సవాలను విజయవంతం చేశాం

తమ పోలీసు శాఖ అంకిత భావంతో పని చేసి దసరా ఉత్సవాలను విజయవంతం చేశారని పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు అన్నారు. వన్‌టౌన్ స్టేషన్ ప్రాంగణంలో పూజల అనంతరం ఆయన సిబ్బందిని అభినందించారు. అధికారులందరూ కలిసికట్టుగా ఉత్సవాలను చక్కగా నిర్వహించారని కొనియాడారు. దసరా వేడుకలకు 16 లక్షల మంది భక్తులు తరలివచ్చారని చెప్పారు. పదమూడు రోజుల పాటు రద్దీ కొనసాగిందన్నారు. వేలాది మంది సిబ్బందితో తమ శాఖ బందోబస్తు చేపట్టిందని వివరించారు.

పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద పారిశుద్ధ్య నిర్వహణ పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలో నిత్యం జరిగే పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తుండాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రం, పాత ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డు, భగత్ సింగ్‌నగర్ రోడ్డు, జీఎస్ రాజు రోడ్డు, అజిత్ సింగ్‌నగర్ ఫ్లై ఓవర్, డాబాకోట్లుసెంటర్, మాకినేని బసవ పున్నయ్య స్టేడియం ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో ఇంటింటి చెత్తసేకరణ సక్రమంగా జరగాలని, రోడ్లు, వీధులు నిరంతరం శుభ్రంగా ఉండేలా స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. సైడ్ డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకోకుండా ఎప్పటికప్పుడు సిల్టు తొలగించాలని అధికారులను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ నగరంలో విద్యుత్ స్తంభాలకు, ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అనధికారిక ఫ్లెక్సీలను, భవన నిర్మాణ వ్యర్థాలను రోడ్లపై రాకుండా తొలగించాలని చెప్పారు.

ముగిసిన ఉచిత వైద్య సేవలు



భవానీ భక్తురాలికి మందులు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ):దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఇంద్రకీలాద్రి దిగువునగల కనకదుర్గానగర్, పరిసర ప్రాంతాల్లో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెడిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రోగ్రాం కమిటీ చైర్మన్ దేవతి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉత్సవాలు ప్రారంభించిన నాటి నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు 24 గంటల పాటు ఈ ఉచిత వైద్య శిబిరంలో సేవలు అందించామని తెలిపారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పొన్నూరు హరినాథ్ ప్రసాద్, పువ్వాడ లక్ష్మీ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో ఈ 12 రోజుల్లో సుమారు 50 వేల మంది భక్తులకు వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. అలాగే ఫిజికెమ్ ఫౌండేషన్ అధినేత సీసీ కేశవరావు రథం సెంటర్‌లో ప్రసాదాల పంపిణీకి సహకరించారని పేర్కొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని భక్తులకు వైద్య సేవలు అందించిన డాక్టర్ కోలా విజయ శేఖర్ వైద్య బృందానికి, మందులు అందించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా ఆర్థిక సహకారం అందించిన లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెడిక సభ్యులకు కృతజ్ఞతలు తెలియ చేశారు.

మహాలక్ష్మి సన్నిధిలో అన్న ప్రసాద వితరణ



అన్నప్రసాదాలకు పూజలు నిర్వహిస్తున్న కమిటీ ప్రతినిధులు



భక్తులకు అన్న ప్రసాద వితరణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని చిట్టినగర్‌లోని మహాలక్ష్మీ అమ్మవారి సన్నిధిలో శనివారం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేలాది మందికి అన్నదానం చేశారు. తొలుత ఆహార పదార్థాలకు ఆలయ కమిటీ కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావులతో పాటు గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ పూజలు నిర్వహించారు. అనంతరం 11 మంది ముత్తైదువులను అమ్మవారి ప్రతిరూపాలుగా భావించి వారికి అన్నప్రసాదాన్ని అందచేసిన అనంతరం భక్తులకు, అమ్మవారి సేవకులకు ప్రసాద వితరణ జరిగింది. కులమతాలకు అతీతంగా పెద్ద ఎత్తున భక్తులు, చిట్టినగర్ వాసులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు పొట్నూరి దుర్గాప్రసాద్, శీరం వెంకట్రావు, కామందుల నరసింహరావు, పోతిన సాంబశివరావు, పిళ్లా విజయ్‌కుమార్, బంక హనుమంతరావు పర్యవేక్షించారు.

ఉత్సవాలు ముగిసినా తప్పని ట్రాఫిక్ ఇక్కట్లు



పశ్చిమ తహసీల్దార్ కార్యాలయం నుంచి నిలిచిన ట్రాఫిక్



108 అంబులెన్స్ వెళ్లేందుకు వీలు లేని విధంగా నిలిచిపోయిన ట్రాఫిక్

సీఎం ప్రోగ్రామ్‌తో సగానికి తగ్గిన పోలీస్ సిబ్బంది

భవానీపురం(విజయవాడ పశ్చిమ): దసరా ఉత్సవాలు ముగిసినా గట్టు వెనుక ప్రాంత ప్రజలకు ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడంలేదు. ఒక వైపు ఉత్సవాలకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తిరుగు ప్రయాణం, మరో వైపు భవానీ దీక్షాపరుల రద్దీ పెరగడంతో వారి రాకపోకలకు సంబంధించిన వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి నానా అవస్థలు పడుతున్నారు. అలానే గట్టు వెనుక ప్రాంత ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. భవానీపురం స్వాతి సెంటర్ నుంచి విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్ వరకు బైక్‌పై వెళ్లాలంటేనే చాలా సమయం పడుతుంది. ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్ నుంచి కుమ్మరిపాలెం సెంటర్ మీదుగా బస్టాండ్, రైల్వే స్టేషన్ వైపునకు వెళ్లాలన్నా పున్నమి హోటల్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ జామ్ అయ్యి వాహనాలు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా అటు కుమ్మరిపాలెం సెంటర్ నుంచి, ఇటు భవానీపురం కరకట్ట వైపు నుంచి, మరో వైపు హిందూ శ్మశానవాటిక దగ్గర ఉన్న పిండప్రదాన రేవు నుంచి, ఐవోసీ పెట్రోల్ బంక్ వైపు నుంచి వన్‌వేలో వచ్చిపోయే వాహనాలతో పున్నమి హోటల్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ నిలిచిపోతుంది. అజిత్‌సింగ్ నగర్‌లో ముఖ్యమంత్రి ప్రోగ్రామ్ ఉండడంతో దసరా ఉత్సవాలకు నియమించిన పోలీస్ సిబ్బందిలో సగం మందిని అక్కడికి పంపించడంతో ట్రాఫిక్‌ను నియంత్రించడం కష్టమవుతుందని విధుల్లో ఉన్న పోలీస్ తెలిపారు. ప్రజలు కూడా సహకరించడం లేదని పోలీసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివా రం ట్రాఫిక్‌లో చిక్కుకొని ముందుకు కదిలేందుకు వీలులేని విధంగా 108 అంబులెన్స్ తీవ్ర అసౌకర్యానికి గురయింది.



విజయవాడ వన్‌టౌన్ పరిధిలో ట్రాఫిక్

అడుగు వేయాలంటే ఆందోళన!



చప్టా రాళ్ల నుంచి బయటకు వచ్చిన ఇనుప చువ్వలు



ఫుట్‌పాత్‌పై ఇష్టానుసారంగా వేసిన చప్టా రాళ్లు

పాల ప్రాజెక్టు ఫ్లై ఓవర్ ఫుట్‌పాత్‌పై రాళ్లు, ఇనుప చువ్వలు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): పాల ప్రాజెక్టు ఫ్లైఓవర్‌పై ఫుట్‌పాత్‌ను ఇష్టానుసారం తవ్వేయడంతో పాదచారులకు ఇక్కట్లు తప్పడం లేదు. పాల ప్రాజెక్టు, కబేళా వైపు నుంచి జక్కంపూడికి వెళ్లే మార్గంలో కుడివైపున ఫుట్‌పాత్‌పై ప్రతి ఐదు, పది అడుగుల మధ్య తవ్వారు. దసరా ఉత్సవాలకు ముందు విద్యుత్ శాఖకు చెందిన కొందరు సిబ్బంది కరెంటు స్తంభాల వద్ద ప్లాస్టిక్ పైపులను సరి చేసేందుకు ఈ తవ్వకాలు జరిపినట్లు సమాచారం. కాగా ఫుట్‌పాత్‌ను తవ్విన తర్వాత మట్టి కుప్పలను అలాగే వదిలేయడంతో పాటు కొన్ని చోట్ల చప్టా రాళ్లు పూర్తిగా ధ్వంసమై అడుగు లోతుకు దిగిపోయాయి. దీంతో చప్టా రాళ్ల నుంచి బయటకు వచ్చిన ఇనుప చువ్వలు ప్రమాదకరంగా మారాయి. అసలే ఫ్లైఓవర్‌పై విద్యుత్ లైట్లు అంతంత మాత్రంగా ఉండటం, దీనికి తోడు ప్రమాదకరంగా ఇనుప చువ్వలు బయటకు రావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో నివసించే చిరుద్యోగులు, వృద్ధులు, సైకిల్స్‌ను వినియోగించే వారు ఈ ఫుట్‌పాత్‌పైనే రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాదకరంగా మారిన ఫుట్‌పాత్‌కు వెంటనే మరమ్మతులు నిర్వహించి పాదచారులను ప్రమాదాల నుంచి కాపాడాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

పాడి రైతులకు రూ. 5.54 లక్షల బోనస్‌లు పంపిణీ



గన్నవరం:మండలంలోని దావాజిగూడెం పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘంలో శనివారం పాడి రైతులకు బోనస్‌లు పంపిణీ చేశారు. సంఘ సభ్యులైన 140 మంది పాడి రైతులకు రూ. 5.54 లక్షల బోనస్‌ను కృష్ణా మిల్క్ యూనియన్ జనరల్ మేనేజర్ డాక్టర్ పాఠీ, సంఘం అధ్యక్షులు గొంది నరేంద్ర అందజేశారు. ఈ సందర్భంగా పాఠీ మాట్లాడుతూ పాడి రైతులు తమ పశువులకు తప్పనిసారిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని చెప్పారు. పాడి రైతుల ఒక వాటా ఇన్సూరెన్స్ చెల్లిస్తే, మిగిలిన రెండు వాటాలను సంఘం, కృష్ణా మిల్క్ యూనియన్ చెల్లిస్తుందన్నారు. సంఘం అందిస్తున్న బోనస్‌ను రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. 2024-25లో సంఘానికి వచ్చిన రూ. 9.90 లక్షలు నికర లాభంలో 70 శాతం పాడి రైతులకు బోనస్‌గా అందజేసినట్లు నరేంద్ర తెలిపారు. అనంతరం అత్యధికంగా గేదె, ఆవు పాలు పోసిన రైతులకు బహుమతులను పంపిణీ చేశారు. క్లస్టర్ మేనేజర్ టి. యశ్వంత్, రూట్ సూపర్‌వైజర్లు పి. రాజీవ్, ఆంజనేయులు, వేతన కార్యదర్శి వి. నాగరాజు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతివనం కాంట్రాక్ట్ కార్మికుల నిరసన



భిక్షాటన చేస్తున్న కార్మికులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 9 నెలలు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం అంబేడ్కర్ స్మృతివనం మెయిన్ గేటు వద్ద భిక్షాటనతో నిరసన వ్యక్తం చేశారు. కార్మికుల నిరసన భిక్షాటనను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.బాబురావు, సీఐటీయూ సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కె.దుర్గారావు మాట్లాడుతూ.. కార్మికుల న్యాయమైన డిమాండ్‌లు, హక్కుల సాధన కోసం శాంతియుతంగా చేస్తున్న నిరసనను అడ్డుకోవటం అన్యాయమన్నారు. అంబేడ్కర్ స్మృతివనం కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న తొమ్మిది నెలల జీతాలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని అధికారులు, కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు.

అడుక్కోవలసిన దుస్థితి ఏర్పడింది..

కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలు సకాలంలో ఇవ్వకపోవటం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఇన్ని రోజులుగా నిరసన ప్రదర్శనలు చేస్తున్నప్పటికీ అధికారులు, కాంట్రాక్టర్ పట్టించుకోకపోవటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్, ప్రభుత్వ అధికారుల చర్యల వల్ల కార్మికులు అడుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు ఎం.సోమేశ్వరరావు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో ధర్నాను విజయవంతం చేయండి



ఉయ్యూరు: ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడలో ఈనెల 7న జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో ప్రధాన కార్యదర్శి కె.రాజేంద్రప్రసాద్ కోరారు. ఉయ్యూరు సీఐటీయు కార్యాలయంలో శనివారం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. డెప్యూటీ జనరల్ సెక్రటరీ పి.ఇమ్మానుయేలు మాట్లాడుతూ 4 డీఏలను విడుదల చేయాలని కోరారు. ఏకీకృత సర్వీసురూల్స్‌లో ఉన్న సమస్యను పరిష్కరించి, పదోన్నతులు కల్పించాలని విన్నవించారు. ప్రతినిధులు బి.లంకేష్, బీవీ రమణ, సురేష్, లక్ష్మణరావు, శ్రీధర్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా వైఎస్సార్ సీపీ



ఉమార్ నియామక పత్రం అందజేస్తున్న నాగుల్‌మీరా తదితరులు

పాయకాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం, మైనార్టీలకు అండగా ఉంటూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అన్నారు. కండ్రికలోని రాష్ట్ర కమిటీ కార్యాలయంలో ఆజాద్ ముస్లిం కమిటీ సభ్యుల సమావేశం శనివారం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన పిమ్మట ముస్లింలకు సంక్షేమ పథకాల ఊసే లేదన్నారు. పేదల కుటుంబాలలోని ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం చేయాలని కోరారు. సంక్షేమ పథకాల సీఎంగా వైఎస్ జగన్‌మోహనరెడ్డి పేరు స్థిరస్థాయిగా గుర్తుంటుందన్నారు. కమిటీ నగర కార్యదర్శిగా ప్రజాశక్తి నగర్‌కు చెందిన మహమ్మద్ ఉమర్ ఫారూఖ్‌ను నియమించి నియామక పత్రాన్ని షేక్ నాగుల్ మీరా అందజేశారు. కమిటీలో చేరిన ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి సిలార్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.







ఇంద్రకీలాద్రిపై

భవానీల రద్దీ



ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో భవానీల రద్దీ కొనసాగుతోంది. వేలాది మంది భవానీ మాలధారులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివస్తున్నారు. క్యూలైన్లు కిటకిటలాడుతున్నాయి. భక్తుల రద్దీతో కొండపై కోలాహలం నెలకొంది. కెనాల్ రోడ్డు నుంచి ఘాట్ రోడ్డు వరకు భవానీలతో ఆ ప్రాంతమంతా నిండిపోయింది.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ